# 'పోటీ'

- వి. ప్రతిమ

'తెలుగు కళాసమితి' న్యూజెర్సీ, రాజాలక్ష్మి ఫౌండేషన్ వారి కథల పోటీలో బహుమతి పొందిన కథ

ఆరేళ్ళ అభినయ కళ్ళల్లో నీటి పొరను చూసి కదిలిపోతూ "ఏమైందిరా?" దగ్గరికి తీసుకుంటూ ప్రశ్నించింది నిర్మల.

"మమ్మీ నాకు సెకండ్ ర్యాంకు" ఈసారి అభినయ కళ్ళల్లో దాగి ఆ పిల్ల గొంతుని రుద్ధం చేయడం ఇష్టం లేని కన్నీళ్ళు చప్పున బయటకొచ్చేశాయి.

"అలాగా" అంది నిర్మల ఒకింత నిరాశగా.

నిర్మలకి అభినయ్ ఒక్కగానొక్క కూతురు. ఆ పిల్ల పుట్టినప్పుడు ఆపరేషను చేయాల్సి రావడంతో నిర్మల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. దాంతో ఇక పిల్లలే వద్దని నిర్ణయించుకున్నారు నిర్మల, భానుచందర్ లిరువురూ.

అభినయ ఏకైక తనయ కావడంతో అమ్మాయి భవిష్యత్తు నిర్మాణం కోసం అహర్నిశలూ పునాది వేస్తూంటుందామె. ఆ పిల్ల ప్రతి కదలికా అపురూపంగా తోస్తుంది నిర్మలకి.

అభినయ ఫస్ట్‌క్లాస్ చదువుతోంది.

అభినయ స్కూల్లో ప్రవేశించిన తరువాత ఇందాకా అన్నీ ఫస్టు ర్యాంకులే. ఎల్.కె.జి., యు.కె.జి. లో అభినయ స్కూల్ ఫస్ట్. అటువంటిది ఫస్ట్‌క్లాస్ కొచ్చాక, అదీ మొదటి యూనిట్ టెస్ట్‌లో తనకి సెకండ్ ర్యాంకు రావడం అభినయకి ఎంతో అవమానంగా తోచింది. అందునా ఆ పిల్ల ఎంతో ఉత్సాహపూరితంగా, డామినేటింగ్‌గా వుంటుంది. తనకంటే మరొకరికి ఒక మార్కు ఎక్కువ రావడం ఆ పిల్లకి తీరని అవమానం.....

"ఫస్ట్ ర్యాంకెవరికి?" ప్రశ్నించింది నిర్మల.

తల్లి గొంతులో నిరాశని చప్పన గుర్తించిన అభినయకి మరింత బాధగా అనిపించింది.

"ఫస్ట్ ర్యాంకెవరికి?" మళ్ళీ ప్రశ్నించింది నిర్మల.

"అనిత అని కొత్తగా వచ్చిందో అమ్మాయి... తనకి" అనిత అన్న పేరు పలకడమే ఇష్టం లేనట్లుగా, అసహ్యంగా పలికిందా పిల్ల,

"ఎన్ని మార్కులొచ్చాయి?"

"నా కంటే ఒక మార్కు ఎక్కువొచ్చింది" ఈసారి వెక్కి వెక్కి ఏడ్చేసింది అభినయ.

నిర్మల చప్పన స్పృహలోకి వచ్చేసింది.

పసిపిల్ల తెలిసీ తెలీక మరెవరికో ఫస్ట్ ర్యాంకు వచ్చినందుకు జీవన్మరణ సమస్యలా దిగులు చెందుతూంటే, ఓదార్చాల్సింది పోయి, 'ఫస్ట్ ర్యాంకెవరికీ, ఎన్ని మార్కులొచ్చాయి?' అంటూ గుచ్చి గుచ్చి ప్రశ్నించడం...

"అభీ" అంటూ కూతుర్ని దగ్గరికి తీసుకుంది.

"ఛ...ఛ... ఏడవకూడదమ్మా... ఇప్పుడేమైందనీ?"

"ఇన్నాళ్ళూ అంటే మీ క్లాసులో



నీతో పోటీ పడి చదివే వాళ్ళే లేక పోయారు.ఇప్పుడు అనిత అనే ఓ కొత్త అమ్మాయి వచ్చింది. దీంతో నీకు మంచి కాంపిటీషన్ అన్నమాట... పోటీ లేనిదే ఏ విద్యకయినా రాణింపు వుండదురా... అసలీ ప్రపంచమే పోటీ ప్రపంచం.... కాంపిటీటివ్ వరల్డ్.... ఒక్క మార్కే కదా నీ కంటే అనితకి ఎక్కువొచ్చింది. ఈసారి నువ్వు మరింత బాగా చదివి అనిత కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోగలవు. నిజం అభీ! నెక్స్ట్ యూనిట్ టెస్ట్‌లో నీకే ఫస్ట్ ర్యాంకొస్తుంది" కూతురి కళ్ళు తుడుస్తూ అనునయంగా చెప్పింది నిర్మల.

"నిజంగానా మమ్మీ"

"అవునురా... తప్పకుండా నీకే ఫస్ట్ ర్యాంకు. పద స్నానం చేద్దూ గాని"

తల్లి ఓదార్పు అభినయ మీద బాగా పని చేసింది. అప్పట్నుండీ మరింత ఎక్కువగా కష్టపడి చదవసాగింది... నిర్మల కూడా మామూలు సమయంలో కంటే ఎక్కువ శ్రద్ధ తీసుకోసాగింది కూతురి మీద.

అయితే దురదృష్టవశాత్తూ రెండో నెలలో జరిగిన యూనిట్ టెస్ట్‌లో

కూడా అనితకే ఫస్ట్ ర్యాంక్ రావడం జరిగింది. అది కూడ సరిగ్గా ఒకే ఒక మార్కు తేడాతో.

అభినయని ఓదార్చడం చాలా కష్టమయిపోయింది నిర్మలకి.

కూతురి నిరాశా, నిస్పృహలు చూసి భార్య మీద మండిపడ్డాడు భానుచందర్.

"ఛ... ఛ... ఏమిటిది నిర్మలా!

ఫస్ట్ ర్యాంకు రావడమే జీవిత ధ్యేయంలా తయారుచేశావు దాన్ని. మంచి మార్కులు తెచ్చుకోవాలని చెప్పడం వరకూ అయితే సరే కానీ ఫస్ట్ ర్యాంకు తెచ్చుకోనట్టయితే ఏవో కొంపలు మునిగిపోతాయన్నట్లుగా... అదే పనిగా తరిమికొట్టకూడదు పిల్లల్ని. అసలీ కొత్తతరం భారమైన చదువుల గొడవలో పడి సహజమైన బాల్య జీవితాన్ని ఎంతగానో కోల్పోతోందని మేధావులంతా గొడవ పెట్టేస్తుంటే ఇదిగో నీ లాంటి తల్లులు చదువూ... చదువూ... అంటూ ఫస్ట్ ర్యాంకు కోసం పిల్లల్ని ముల్లు కర్రతో పొడుస్తున్నారు.

నిమ్మీ... ఇదేమంత మంచి పరిణామం కాదు. చూడు పాప ఎలా అయిపోయిందో, వడలిపోయి అదే దిగులుతో జ్వరం తెచ్చుకుంది" అభినయ ఒంటి మీద చేయి వేసి చూసూ భార్యని విసుక్కున్నాడు భానుచందర్.

"ఇందులో నేను చేసిందేముందండీ.... దాన్ని కూర్చోబెట్టి చదివించి ఫస్ట్ ర్యాంకు కోసం ప్రయత్నించడం నా తప్పా! తన బిడ్డకి మంచి మార్కులు రావాలని ఏ తల్లికి మాత్రం వుండదు చెప్పండి?" నిర్మల అహం దెబ్బతింది. పైకి అలా అందే కానీ, కూతురు మరీ అంత నిస్పృహతో జ్వరం తెచ్చుకోవడం ఆమెకీ బాధగానే వుంది.

"ఫస్ట్ ర్యాంక్ రావడమే తెలివితేటలకి కొలబద్ద కాదు నిమ్మీ... నీలాటి తల్లులు ఎంతో మారాల్సి వుంది" భార్యని చూసి మనసులోనే బాధపడుతూ కూతుర్ని డాక్టరు వద్దకి తీసుకెళ్ళాడు భానుచందర్.

ఆ రాత్రంతా మూసిన కన్ను తెరవలేదు అభినయ.

భార్యా భర్తలిరువురూ నిద్ర లేకుండా చెరో ప్రక్కా కూర్చున్నారు...

అర్ధరాత్రి దాటిన తరువాత కన్ను తెరిచింది అభినయ.

"అమ్మా మంచినీళ్ళు"

వెంటనే హడావిడిగా లేచి వెళ్ళి కూతురికి మంచినీళ్ళు తాగించింది నిర్మల.... ఈ హడావిడికి కుర్చీలో కూర్చుని ముందుకు జోగుతోన్న భానుచందర్కి మెలకువ వచ్చింది.

"పాపా కొంచెం పాలు తాగుతావా?" అంటూ భార్య కేసి తిరిగి....

"నిమ్మీ పాలు వేడి చేసి తీసుకురా" చెప్పాడు.

వెంటనే నిర్మల వంట గదికేసి నడిచింది.

"డాడీ" పిలిచింది అభినయ.

"ఏంటమ్మా" అభినయని అపురూపంగా దగ్గరికి తీసుకుంటూ ప్రశ్నించాడు భానుచందర్.

"డాడీ..."

"చెప్పరా... ఏం కావాలి?"

"డాడీ... నేను రేపు అనితని మనింటికి తీసుకువస్తాను..."

"అలాగేనమ్మా" అనితనీ, ఆ పిల్లకి వచ్చిన ఫస్ట్ ర్యాంకునీ మర్చిపోలేని కూతురి కేసి జాలిగా చూస్తూ చెప్పాడు భానుచందర్.


"అది కాదు డాడీ... రేపు అనితని మంచి మాటలతో మనింటికి తీసుకొస్తాను... డాడీ... డాడీ మనం అనితకి విషమిచ్చి చంపేద్దాం డాడీ... అప్పుడిక ఎప్పటికీ నాకే ఫస్ట్ ర్యాంకు"

హతాశుడైన భానుచందర్ నోట మాట రాక, కూతురి కేసి నిర్జీవంగా చూస్తుండిపోయాడు.

కూతురికి పాలు తీసుకొస్తున్న నిర్మల ఆపాదమస్తకం కంపించిపోవడంతో ఆమె చేతిలోని గ్లాసు కిందపడి పాలు నేలపాలయ్యాయి. షాక్ తిన్నట్లుగా అక్కడే నేల మీది కొరిగిపోయిందామె.

ఈ పోటీ ప్రపంచంలో ప్రతీ విషయంలో నేనే నెంబర్ వన్ కావాలంటూ పెడుతోన్న పరుగుల మూలంగా పెరుగుతోన్న నేర ప్రవృత్తి... ఇంత పసి వయసులో మరో ప్రాణిని హత్య చేయాలన్న ఆలోచన కలగడం, చుట్టూ వున్న సినిమాలు, టి.వి.లు... మనిషిని మరో మనిషి చంపడమన్నది సహజ సిద్ధమైనదిగా, ఎంతో తేలికయిన విషయంగా చూపెట్టడం.... అసలు మనిషిలో మానవత్వమన్నది నశించి ఏ మార్గంలో ఈ ప్రపంచం నడుస్తోంది అన్నది ఆలోచిస్తుంటే భానుచందర్ తల నరాలు చిట్లిపోతున్నట్లుగా వున్నాయి.

ఆ నిశిరాతిరి, రుద్రవీణలు విషాద గీతాలాలపించే వేళ, తోడేళ్ళు నిద్ర లేచి ఆవురావురుమంటూ జంతువులకై వేటాడే వేళ, అడవి దారులు రక్తంతో తడిసే వేళ... కూతుర్ని చూస్తుంటే భానుచందర్కి వెన్నులో నుండి సన్నని ప్రకంపన బయల్దేరింది!




"ఈనెల యాభై రూపాయలిస్తాను. వచ్చే నెల వంద రూపాయలిస్తాను సరేనా?" అన్నది ఇంటావిడ.

"అలాగేం! అయితే వచ్చే నెల నుంచే పనిలోకి వస్తాను సరేనా" అన్నది పనిమనిషి.

— శ్రీకొండ, ఎర్రబోడు

